
డబల్ బెనిఫిట్‌తో




# గీత

పి. శ్రీనివాస్

ఇం.నెం. 11–25–305,
కొత్తవాడ,
వరంగల్ 506 012

ఇంకా తెల్లవారడానికి చాలా టైముంది.

అప్పటికింకా ఎవరూ లేవలేదు.

గీత తలుపు తీసుకుని బయటకొచ్చింది. ఇంట్లో అందరూ పడుకుని వున్నారు. ఎవరూ లేవక మునుపే తన పని ముగించుకోవాలనుకుంది.

గీతకు పదహారేళ్ళు. సిగ్గు, మొహమాటం కాస్త ఎక్కువే. ఇటువంటి పనిచేయడం ఇదే మొదటిసారి. అందుకే భయంగా వుంది. అంతా కొత్త. ఇంట్లో ఎవరికీ కనబడకుండా దాచి వుంచిన దాన్ని తీసుకుని వచ్చింది. దాన్ని పట్టుకున్న చేయి సన్నగా వణుకుతుంది.

ఇప్పుడు తను చేయబోయేది ఒకవేళ ఫెయిలైతే... అమ్మో ఆలాజరగదాన్కి వీలులేదు అనుకుంది. దీనికోరకు రెండ్రోజుల్నుండి ప్రిపేరయిందికూడా.

తెల్లారి లేచి అందరూ చూసి ఏమంటారోననే భయంకూడా వుంది.

గుండె చిక్కబట్టుకుని మొదట చేయవలసిన పనులు ముగించింది. ఇక ఇప్పుడు మొదలవుతుంది అసలు పని.

ఇంట్లోనుండి తెచ్చినదాన్ని పట్టుకుని మూడడుగులు ముందుకు నడిచింది. అక్కడ నిలుచుండి మొదలుపెట్టింది తన పని. చేతులు, నడుము తిమ్మిరి (?) నొప్పి పెట్టసాగాయి. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. అరగంట పట్టింది అది పూర్తవడానికి . అప్పటికి కాస్త తెల్లవారింది.

ప్రక్కవాటాల్లోనివారు కొందరు లేచి గీతని ఆశ్చర్యంగా చూడసాగారు. గబగబా ఇంట్లోకి నడిచి తలుపేసింది గీత అదురుతున్న గుండెలతో. తన ఈడువాళ్ళందరూ ఇలానే భయపడ్డారు కాబోలు మొదటిసారి అనుకుంది. తను చేయనని అమ్మ రోజూ తిడ్తుంది. అందుకే ధైర్యం చేసింది ఈ రోజు. తెల్లవారింది.

"అమ్మో గీతా! ఎంత బాగా వేసావే, నీకు ఇంత బాగా వెయ్యడం వస్తున్న సంగతి నాకు తెలియదు. రోజూ నువ్వే వెయ్యమ్మా... ముసలిదాన్నవుతున్నాను. నాకేం చేతనయి చస్తుంది గనుక" అంది తల్లి గీతతో గీతవేసిన ముగ్గుని చూస్తూ.

ఇంట్లోనివారందరూ ముగ్గుచుట్టూ చేరారు.

*

# మందహాసం

వి.ఉషాచైతన్య

3–5–1038, నారాయణగూడ,
హైదరాబాద్ – 500 029.

ఐస్‌క్రీం పార్లర్‌లోంచి ఫామిలీ ఐస్‌క్రీం పాక్ తీసుకుని గబగబా రోడ్ క్రాస్‌చేసి కారువైపొస్తున్నాడు డ్రైవర్. కారుకీ... అతనికీ వో అరగజం దూరం... . అదీ వో అడుగేస్తే అయిపోయేదే... కానీ అంతలోనే విసురుగా దూసుకుని వచ్చిన సైకిల్ కార్నీ... కారువైపు అడుగెయ్యబోతున్న డ్రైవర్‌ని గట్టిగా డాష్ ఇచ్చి ముందుకెళ్ళి స్కిడ్ అయిపోయింది.

క్షమించెయ్యవచ్చు! కాని ఐస్‌క్రీం...?! డ్రైవర్‌చేతుల్లోంచి అల్లంత దూరాన పడిన ప్యాక్.. క్షణం గడవకిముందే సిటీబస్ చక్రాలకిందపడి నలిగిపోయింది. స్కిడ్ అయిన సైకిల్ తాలూకు మనిషి డ్రైవర్‌ని నిర్లక్ష్యంగా ఏదో తిట్టబోయాడు. కాని అదేక్షణంలో.. కారు అద్దాల్లోంచి బంగారురంగు ఫ్రేము కళ్ళద్దాలూ... మెళ్ళో బంగారు చైను, సిలుకు చొక్కా బంగారు మనిషిని చూసి గతుక్కుమంటూండగానే... ఆ బంగారు మనిషి కారు తలుపు 'క్లిక్'మనిపించి క్రిందకు దిగబోయాడు... "క్షమించండి సార్... వాడే... వాడే... తప్పయిపోయింది" అంటూ క్షణంలో ఐస్‌క్రీం పార్లర్‌వైపు పరుగెత్తడం, మరో ఐస్‌క్రీంపాక్ తెచ్చివ్వడం... క్షణాల్లో జరిగిపోయింది.

* * *

"వోర్నీ జిమ్మడ... నాల్రూపాయలెట్టి కొనుక్కున్న బియ్యాన్ని నేలపాల్జేసినావుగదరా... నీ కడుపుకాల... నా బిడ్డలుసురు నీకు తగల... అయ్యో... అయ్యో... గింజకూడా మిగలకుండా నేలపాల్జేసినావుగదరా..." పక్కకెటో చూస్తూ నడుస్తూ చూడక పోలమ్మని 'ఢీ' కొట్టాడా మనిషి. దాంతో చేతిలో బియ్యం పొట్లాం పగిలి బియ్యమన్నీ దుమ్ములో కలిసిపోయాయి.

నడిరోడ్డుమీద తిట్లు లంకించుకుంది పోలమ్మ. అందరూ అతన్నే చూస్తోంటే సిగ్గుతో చితికిపోయినట్టయిందతని పరిస్థితి "కాస్త ఆగవమ్మా" అంటూ జేబులోంచి ఐదు రూపాయల్నోటు తీసిచ్చి పరుగెత్తినట్టే వెళ్ళిపోయాడు. పాపం ఆ థర్డ్‌క్లాస్ ట్రీట్‌మెంట్‌కి కళ్ళు తిరిగిపోయి వుంటాయ్ ఆ మనిషికి...!

* * *

ఊపిరాడనంత రష్షుగా వుంది బస్సు. రామం చేతిలో మోదుగాకు పొట్లాంలో జాజిపూలున్నాయ్ . వాటి వాసన నాసికకు తగుల్తోంటే... "మూణ్రోజుల్నుంచీ పావలా పెట్టి పూలైనా కొనలేని మొగుడండీ...!" అని మూతి ముప్పయి వంకర్లు తిప్పి అలిగి మూడంకేసి పడుకుంటోన్న లలిత గుసగుసగా చెవుల్లో ఏదో చెబుతూ ఆ వేళ కౌగిట్లో వొదిగిపోతోన్న ఫీలింగ్!

నాలుగొందల జీతంలో పర్వం కొనుక్కుని బతకాలి నగరంలో... అలాంటి మధ్యతరగతి మనిషి రోజూ పూలు కొనాలంటే...?!

"నారాయణగూడ..." బస్సులో ఎక్కణ్ణుంచో కండక్టర్ పిలుపు కాదు... అరుపు! జనాల్ని తోసుకుంటూ దిగబోయేంతలో ఫుట్‌బోర్డుమీంచి తోశారెవరో వెనకనుంచి. మొహం వెళ్ళి నేలకి తగిలే ప్రమాదంనుంచి అతి ప్రయత్నంమీద తప్పించుకున్నాడు. కాని చేతిలో పూలపొట్లాం... బురదనీళ్ళలో పడిపోయింది. మెలితిరిగిన కాలు పెడ్తోన్న బాధకి ఏమనిపించలేదు. కాని ప్చ్... పూలు... ఎంతో కోరికతో ఇష్టంగా . కొన్న పూలు... జాజిపూలు...?!

"సారీ గురూగారూ! వెనక మనిషి నన్ను నెట్టాడు. నేను మీ మీద పడక తప్పిందికాదు.. అయ్యో మీ పూలు..." పాపం ఏమంటాడు గుర్నాథం? అందులో మధ్యతరగతి గుర్నాథం...?!

పోలమ్మలా రగడచేసి పూలు కొనిపించుకోలేడు! ఖరీదైన కారుమనిషిలా ఉరుముల్లాంటి చూపుల్తోనూ కొనిచ్చుకోలేడు.

"ఫర్లేదులెండి... ఓకేటీజీ...!" విడవలేక నవ్వేడు గుర్నాథం.

అదేకాబోలు మధ్యతరగతి మందహాసం...!

*

ఈ పేజీల్లో కథ ప్రచురిస్తే చాలు. మీకు కథలు రాయడం వచ్చేసినట్టే! అంటే రచయితగా,
లకు రెమ్యునరేషన్‌తోపాటు ఆంధ్రభూమి ప్రశంసాపత్రం ప్రత్యేకంగా లభిస్తుంది! ఈ